# 16న గోపాలుని నిత్యమాస కల్యాణోత్సవం

**అనపర్తి, మార్చి 7, ప్రభాతవార్త :**

మండల పరిధిలో గల పొలమూరు లో మదనగోపాలస్వామి నిత్యమాస కళ్యాణం ఈనెల 16 న జరుగనున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు. రోహిణి నక్షత్రం సందర్భంగా ప్రతి నెల నిర్వహించే శాంతికర కళ్యాణం లో భాగంగా వైఖానస ఆగమ విధానంలో రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాలస్వామి కళ్యాణం జరుగనున్నట్టు అయన తెలిపారు. ఉదయం 9 గంటలకు విశ్వక్షేణ ఆరాధన, పుణ్యాహవచనం, పాద ప్రక్షాళన, మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు తో స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తునట్టు అయన తెలిపారు.



# అన్నదమ్ములను కలిపిన టీడీపీ-జనసేన పొత్తు

**జనసేన - టీడీపీ శ్రేణుల్లో జోష్**

**చేయి చేయి కలిపిన బండారు సోదరులు**

**సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్**

**నియోజకవర్గంలో మారుతున్న రాజకీయం**

**రావులపాలెం, మార్చి 7, (ప్రభాతవార్త) :**

తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తుతో రాష్ట్రమంతా ఎలా ఉన్నా ఆ నియోజకవర్గంలో మాత్రం సీటు విషయంలో అన్నదమ్ములిద్దరి మధ్య సయోధ్య కష్టమని అధికార పక్షమే కాదు.. రాజకీయ విశ్లేషకులు కూడా భావించారు. రాజకీయ విభేదాలతో కొన్ని దశాబ్దాలుగా అంటీముట్టినట్టుగా ఉన్న ఆ అన్నదమ్ముల మధ్యే రచ్చ మరింత పెరుగుతుందని అనుకున్నారు. టిక్కెట్ దక్కని వారు ఇండిపెండెంట్ గా బరిలోకి దిగుతారనే ప్రచారం కూడా జోరుగా సాగింది. అయితే అందరి ఊహాగానాలు, ప్రచారాలను పటాపంచలు చేస్తూ చేయీ చేయీ కలిపారు.. టీడీపీ, జనసేన కూటమి విజయమే తమ లక్ష్యం అని ప్రకటించారు ఆ అన్నదమ్ములు..ఇంతకీ ఎక్కడ ఈ నియోజకవర్గం అనుకుంటున్నారా.. అదే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం.. ఆ ఇద్దరు అన్నదమ్ములు ఎవరో కాదు.. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మరొకరు జనసేన కొత్తపేట ఇన్చార్జి బండారు శ్రీనివాసరావు. వీరి స్వగ్రామం కొత్తపేట మండలంలోని వాడపాలెం. వీరిద్దరి నివాసాలు ఎదురెదురుగానే ఉంటాయి. అయితే ఒక ఇంటిమీద కాకి మరో ఇంటి మీద వాలకూడదనే విధంగా నిన్న మొన్నటి వరకు వీరి కుటుంబాల మధ్య రాజకీయ విబేధాలు ఉండేవి. గత కొంతకాలంగా ఇదే వైరం కొనసాగుతున్న నేపథ్యంలో బండారు సత్యానందరావు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా, ఆయన సోదరుడు బండారు శ్రీనివాసరావు జనసేన పార్టీ ఇన్చార్జిగా కొనసాగుతూ వచ్చారు. అయితే జనసేన , తెలుగుదేశం పార్టీల మధ్య పొత్తు ఖరారు కావడంతో కొన్ని ఉమ్మడి కార్యక్రమాల్లో అప్పుడప్పుడు కలిసినా అంతగా అనుబంధమేమీ కనిపించేది కాదు.. పొత్తులో భాగంగా కొత్తపేట సీటు తప్పకుండా జనసేనకే వస్తుందనే నమ్మకంతో బండారు శ్రీనివాసరావు పార్టీ కార్యక్రమాల్లో ముందుకు సాగారు. ఒంటిరిగా పోటీ చేసినా తాను గెలుస్తాననే భావనతో బండారు శ్రీనివాసరావు ఉన్న నేపథ్యంలో టీడీపీతో పొత్తు ఏర్పడింది. అప్పట్నుంచి కొత్తపేట సీటు జనసేనకు దక్కుతుందా, తెలుగుదేశానికి దక్కుతుందా అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఎవరికివారే ధీమాగా సీటు నాకంటే నాకే అనుకుంటూ బండారు సోదరులు తమ తమ పార్టీ కార్యక్రమాలు నిమగ్నమయ్యారు. అయితే ఇటీవల జనసేన- తెలుగుదేశం పొత్తులో కొత్తపేట సీటును తెలుగుదేశానికే కేటాయించారు. బండారు సత్యానందరావునే అభ్యర్థిగా చంద్రబాబు, పవన్ మొదటి జాబితాలో ప్రకటించారు. దీనిపై బండారు శ్రీనివాసరావుతో పాటు ఆయన వర్గం అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. తనకే సీటు వస్తుందని ఆశిస్తే ఇంత అన్యాయం చేస్తారా అంటూ బండారు శ్రీనివాసరావు, ఆయన అనుచరగణం ఆవేదన వ్యక్తం చేసారు. కొద్ది



రోజులు మౌనంగా ఉండిపోయారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను కలిసి కొత్తపేట సీటు విషయంలో పునరాలోచన చేయాలని కోరాలని అనుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ సీటు తగవు ఇద్దరి మధ్య విభేదాలను మరింతగా పెంచు తుందిని రాజకీయ వర్గాలు భావించాయి. అయితే బండారు సత్యానందరావు ఒకవైపు తన ఎన్నికల ప్రచారాన్ని తాను చేసుకుపోతూనే, మరోవైపు తమ్ముడు బండారు శ్రీనివాసరావును కలుపుకొని వెళ్లేందుకు సమాలోచనలు చేస్తూ ఉన్నారు. కొందరు పెద్దలు వీరిద్దరి మధ్య సర్దుబాటుకు సంప్రదింపులు జరిపారు. పొత్తు ధర్మం పాటించి బండారు శ్రీనివాసరావు తన అన్న టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావుకు సహకరించకపోతే కొత్తపేట ఎన్నిక ఫలితంపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని ఇద్దరి మధ్య నెరపిన చర్చలు ఫలించి ఇద్దరూ కలిసేందుకు మార్గం సుగమం అయ్యింది. పవన్ కళ్యాణ్ సూచనలతో పొత్తు ధర్మం ప్రకారం కలిసి పనిచేయాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే ఎన్నికల తర్వాత చూసుకోవాలని, అదే విధంగా పార్టీ కోసం పనిచేసిన నాయకులకు ప్రభుత్వం వచ్చాక తగిన గుర్తింపు ఉంటుందని పవన్ సూచించారని చెబుతున్నారు. దీంతో కొత్తపేట కాపు కళ్యాణమండపంలో బండారు శ్రీనివాసరావు బుధవారం జనసేన ముఖ్యనాయకులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు, జన సైనికుల సలహాలు , సూచనలు తీసుకున్నారు. పొత్తులో భాగంగా కలిసి వెళ్లడానికే ఎక్కువ మంది మొగ్గు చూపారు. అయితే పొత్తులో భాగంగా కొత్తపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నుంచి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని జన సైనికులు సూచన చేసారు. ఇదే సమావేశంలో పాల్గొన్న బండారు సత్యానందరావు జనసైనికుల సూచనలను పరిగణనలోకి తీసుకుని తగిన హామీ ఇచ్చారని, జనసేన నాయకులకు తగిన ప్రాధాన్యతను ఇస్తానని సత్యానందరావు చెప్పడంతో వారి మధ్య వున్న పొరపొచ్చాలకు తెరపడినట్టు తెలిసింది. దీంతో సమావేశంలో టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇన్ఛార్జి బండారు శ్రీనివాసరావులు చేయి చేయి కలిపారు. ఇద్దరు చేతులెత్తి విజయ సంకేతం చూపించారు. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అన్నదమ్ముల వివాదానికి తెరపడినట్లయిందని టిడిపీ, జనసేన నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. మొత్తానికి బండారు సోదరులు ఒక్కటి కావడంతో ఇరు పార్టీల శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# రత్నగిరిపై ప్రసాద్ పథకం అభివృద్ధి పనులకు ప్రధాని వర్చ్యువల్ శంకుస్థాపన

**అన్నవరం/శంకవరం మార్చి 7 ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రసాద్ పథకం కింద మంజూరైన నిధులతో రత్నగిరిపై చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. కొండపైన గల వార్షిక కళ్యాణ మండపం వద్ద స్క్రీన్ ఏర్పాటు చేసి కొండపై నిర్మించబోయే బిల్డింగుల నమూనా ప్రక్రియను టూరిజం అధికారులు ప్రదర్శించారు. ఈవో కే రామచంద్ర మోహన్ మరియు చైర్మన్ ఐ వి రోహిత్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన దీనికి ఎంపీ వంగా గీత మరియు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అతిథులుగా హాజరయ్యారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పర్యటన శాఖ పర్యవేక్షణలో భక్తులకు ఉపయోగపడే అన్నదానం బిల్డింగు దర్శనం క్యూ లైన్ కాంప్లెక్స్ సులాబ్ కాంప్లెక్స్ వంటి వారి నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఈవో రామచంద్ర మోహన్ తెలిపారు. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం నాలుగు ఎలక్ట్రికల్ వెహికల్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొండపై సుమారు 54 కోట్లతో వాళ్ళ అభివృద్ధి పనులకు 2021లో అంచనాలు నివేదికను పంపించగా 20 కోట్లు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ పాలకమండ సభ్యులు కొత్తం దత్తుడు, నక్క అశ్విని దలే చిట్టిబాబు దేవస్థానం అధికారులు పురోహితులు భక్తులు పాల్గొన్నారు.





# టికెట్ల కేటాయింపులో శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

## - రామచంద్రపురం టిక్కెట్ సుబ్రహ్మణ్యంకే ఇవ్వాలి

**కొత్తపేట మార్చి 7 (ప్రభాతవార్త)**

రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి కేటాయించే అసెంబ్లీ టిక్కెట్లలో శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని టీడీపీ శెట్టిబలిజ సామాజిక వర్గ నాయకులు డిమాండ్ చేసారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో గురువారం సాయంత్రం టీడీపీ శెట్టి బలిజ నాయకుల సమావేశం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజ సాధికారిక కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇటీవల టీడీపీ, జనసేన ప్రకటించిన సీట్లలో కనీసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క సీటు కూడా శెట్టిబలిజలకు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటే నిలిచిన శెట్టిబలిజలకు తగిన ప్రాధాన్యత కల్పించకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. వైసీపీలో ఇప్పటివరకు ప్రకటించిన సీట్లలో మూడు అసెంబ్లీ, రెండు ఎంపీ సీట్లను శెట్టిబలిజలకు కేటాయించారని గుర్తు చేశారు. ఆ పార్టీకి ధీటుగా కాకపోయినా కనీసం రెండు అసెంబ్లీ సీట్లను, ఒక ఎంపీ స్థానం అయినా శెట్టిబలిజలకు కేటాయిస్తే తమ సామాజిక వర్గీయుల్లో ఓట్లను అడిగేందుకు వీలుంటుందనీ అన్నారు. ఇప్పటికైనా టీడీపీ, జనసేన అధినాయకులు స్పందించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీసీ వర్గాల్లో అత్యధిక సంఖ్యలో ఉన్న శెట్టిబలిజలకు కనీసం రెండు అసెంబ్లీ సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. రెండు అసెంబ్లీ సీట్లను తమ వర్గీయులకు ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించి తమ సత్తా ఏంటో చూపిస్తామని చెప్పారు. అలాగే రామచంద్రపురం నియోజకవర్గంలో టిక్కెట్ ను రెడ్డి సుబ్రహ్మణ్యంకు కేటాయించాలని కోరారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు రెడ్డి సుబ్రహ్మణ్యం పార్టీని తన భుజాలపై వేసుకుని ముందుకు



నడిపించారన్నారు. అలాంటి వ్యక్తికి ఇప్పటివరకు సీటు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ సాధికారిక కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, డాక్టర్ కాదా వెంకటరమణ, చెల్లుబోయిన శ్రీను, మొల్లేటి శ్రీను, మల్లుల పోలయ్య, మేడిశెట్టి సూర్యనారాయణ, పితాని వీరభద్రరావు, గుత్తుల పట్టాభి రామారావు, కముజు వెంకటేశ్వరరావు, మట్టపర్తి రాజేశ్వరరావు, మట్టపర్తి అచ్యుత్, యల్లమెల్లి జగన్మోహన్, వనుము వీరబ్రహ్మం, కడలి వెంకటేశ్వరరావు, చొల్లంగి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# పూర్ణాహుతితో ముగిసిన కోటి పార్థివలింగ మహా రుద్రాభిషేకం

**-మఠాధిపతులు పూజ్యశ్రీ జగద్గురు పరమహంస**

**-శ్రీ సద్గురు సచిదానంద సరస్వతి మహాస్వామి**

**-ఏలేరు నదిలో కోటి పార్థివలింగాల నిమజ్జనం**

**జగ్గంపేట/గండేపల్లి మార్చి 7 (ప్రభాతవార్త):**



జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం నందు జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు ఆధ్వర్యంలో కోటిపార్థివలింగ మహా రుద్రాభిషేకం ఫిబ్రవరి 26వ తేదీ నుండి మార్చి 7వ తేదీ వరకు 11 రోజులపాటు నిర్వహించి గురువారం పూర్ణాహుతి కార్యక్రమంతో కోటి పార్థివలింగ మహా రుద్రాభిషేకం ముగించారు. ఈ ముగింపు కార్యక్రమానికి శ్రీ శృంగేరి జగద్గురు కృప పోషిత తుని తపోవన శ్రీ మఠాధిపతులు పూజ్యశ్రీ జగద్గురు పరమహంస శ్రీ సద్గురు సచిదానంద సరస్వతి మహాస్వామి హాజరై పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని కోటిలింగాలను దర్శించుకున్నారు. అనంతరం 11 రోజులుగా మహా రుద్రాభిషేకం అందుకున్న కోటి పార్థివలింగాలను భక్తుల స్వహస్తాలతో ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం శాసనసభ్యులు మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని కోటిలింగాలను దర్శించుకున్నారు. చిన్నారులు భరతనాట్యంతో భక్తులను అలరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఇంతటి గొప్ప మహా యజ్ఞం చేయడం చాలా కష్టతరమైన పని అని ఆ శివుడి సంకల్పంతో జ్యోతుల నెహ్రూ కుటుంబం శృంగేరి పీఠాధిపతుల దివ్య ఆశీస్సులతో నిర్విఘ్నంగా నిర్వహించి ఈరోజు పూర్ణాహుతితో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేసుకుని ఈ లింగాలను ఏలేరు నదిలో నిమజ్జనం చేసి ఒక గొప్ప క్షేత్రంగా ఈ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానం విరాజిల్లుతుందని స్వామీజీ అన్నారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జగద్గురు పరమహంస శ్రీ సద్గురు సచిదానంద సరస్వతి మహాస్వామి ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవడం ఆ శివుడు పుట్టినటువంటి మహాశివరాత్రి రోజున వీరు కూడా పుట్టడం ముందుగా వీరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీస్సులు ఇమ్మని కోరుతున్నానని అన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమం మా గురువర్యులు శృంగేరి పీఠాధిపతులు దివ్య ఆశీస్సులతో దిగ్విజయంగా పూర్తి చేసుకున్నామని అన్నారు. వేలాదిగా వచ్చిన భక్తులందరికీ మహా అన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, దాసరి తమ్మన్న దొర, తుమ్మల బాబు, ఆకుల రామకృష్ణ, కోర్పు సాయి తేజ, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు, కుంచే రాజా, అడబాల రామాంజనేయులు, జీను మణిబాబు, ముసిరెడ్డి నాగేశ్వరరావు, సుంకవిల్లి రాజు,దాపర్తి సీతారామయ్య, పైడిపాల సూరిబాబు, జంపన రవి వర్మ, వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

# ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో "మహిళా దినోత్సవ" వేడుకలు

**గండేపల్లి మార్చి 7 (ప్రభాతవార్త):**

"అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని" పురస్కరించుకుని స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా డిస్ట్రిక్ట్ ఉమెన్ డెవలప్మెంట్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసరు కె.ప్రవీణ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటక్షన్ ఆఫీసరు సి.హెచ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ విశ్వవ్యాప్తంగా ఉండే మహిళలకు తమ కళాశాల మహిళా సిబ్బందికి తన హృదయ పూర్వక శుభాభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల మహిళా సిబ్బంది విద్యార్థినిలకు మహిళా సాధికారిత గురించి తెలియజేసారు.ముఖ్య అతిదిగా విచ్చేసిన కె.ప్రవీణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ సమాజంలో మహిళా శక్తి అన్ని రంగాలలో విస్తరించి ప్రపంచ పురోగతిలో కీలకపాత్ర వహిస్తున్నారని, అంతేకాక నేటి సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వివక్షల గురించి వివరిస్తూ, మహిళల భద్రతకై 3 సూత్రాలను పాటించాలని తెలియజేసారు. ఎవరైనా అపరిచితులతో మాట్లాడేటప్పుడు 3వ వ్యక్తి ఉండేలా చూసుకోవాలని, లేనిపక్షంలో 3 ని?ల సమయం మించి మాట్లాడరాదని, మాట్లాడేటప్పుడు 3 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలని జాగ్రత్తలు తెలియజేసారు. ప్రతి విద్యార్థినీ సమాజంలో జరిగే అసమానతలపై, వివక్షలపై నోరు విప్పాలని పేర్కొన్నారు.మరో ముఖ్య అతిధి సి.హెచ్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, స్త్రీ శిశు సంక్షేమం కోసం సమాజంలో డిస్ట్రిక్ట్ ఉమెన్ డెవలప్మెంట్ చైల్డ్ డెవలప్మెంట్ విభాగం అందిస్తున్న వివిధ సేవలను విద్యార్థినులకు తెలియజేసారు. అంతేకాక సమాజంలో స్త్రీల పట్ల జరుగుతున్న అరాచకాల పట్ల అవగాహన కలిగి ఉండి జాగురూకతతో మెలగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ మేనేజ్మెంట్ ఎం.వి.హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరేష్, కళాశాల మహిళా సాధికారికత గ్రీవెన్స్ సెల్ మెంబర్లు, ఉద్యోగినులు, మహిళా విద్యార్థినులు పాల్గొన్నారు.మాట్లాడుతూ, తమ కళాశాలలో ప్రతి సంవత్సరం ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ కళాశాల మహిళా సాధికారతలో ఎప్పుడూ ముందంజలో ఉంటుందని తెలియజేసారు. ముఖ్య అతిధులు తమ అమూల్యమైన సమాయాన్ని వెచ్చించి తమ విద్యార్థినులకు ఎంతో విలువైన సూచనలను




అందజేసినందుకు కృతజ్ఞతగా వారిని సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ మేనేజ్మెంట్ శ్రీ ఎం.వి.హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ శ్రీ ఎం.సతీష్, ప్రిన్సిపాల్ డా౹౹ కె. సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డా? జి.నరేష్, కళాశాల మహిళా సాధికారికత మరియు గ్రీవెన్స్ సెల్ మెంబర్లు, ఉద్యోగినులు మరియు మహిళా విద్యార్థినులు పాల్గొన్నారు.

# పెడసనగంటి అఖండ భారత దేశ యాత్ర విజయవంతం

## యాత్ర చరిత్రాత్మకమని కొనియాడిన గ్రామ పెద్దలు

**రావులపాలెం, మార్చి 07 (ప్రభాతవార్త) :**

శ్రీ ఆదిశంకరాచార్యుల వారిని ఆదర్శంగా తీసుకుని రావులపాలెం గ్రామానికి చెందిన టీటీడీ వేద పండితులు పెడసనగంటి సీతారామమూర్తిశర్మ అవధాని వరుసగా మూడు సార్లు అఖండ వేద భారత పరిక్రమ యాత్ర విజయవంతంగా పూర్తి చేయడం చారిత్రాత్మక ఘట్టం అని పలువురు కొనియాడారు. వేద సంరక్షణార్థం, ధర్మ సంరక్షణార్థం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వరుసగా మూడోసారి నెలరోజుల పాటు శ్రీ ఆదిశంకర వేద భారత పరిక్రమ యాత్రను పూర్తి చేసుకుని స్వగ్రామం రావులపాలెంకు చేరుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం శుక్ల యజుర్వేద పండితుడు పెడసనగంటి సీతారామమూర్తిశర్మ అవధానికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా 108 శ్రీ శంకరాచార్యుల వారి విగ్రహాలను ప్రతిష్ఠించి శ్రీ ఆది శంకరాచార్యుల వారి విగ్రహంతో గ్రామానికి చేరుకున్న ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీతారామమూర్తిశర్మ అవధాని స్వగృహం వద్ద జరిగిన అభినందన కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం చారిత్రాత్మకంగా అయోధ్య క్షేత్రంలో శ్రీ బాలరాముల వారి విగ్రహ ప్రతిష్ఠలోను వేద పారాయణం చేసానని చెప్పారు. ఈ యాత్రలో భాగంగా భారతదేశంలోని సమస్త నదీ జలాలను సేకరించానని చెప్పారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి మన్యంపర్వతవర్ధనరావు, కొంపెల్ల సోమయాజులు, దాసరి సత్తిబాబు మాట్లాడుతూ సీతారామమూర్తిశర్మ అవధాని చేపట్టిన యాత్ర ఎంతో గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాపాక దుర్గారామచంద్రమూర్తిశర్మ, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు కర్రి సుబ్బారెడ్డి, సాయినిత్యేష్, మానాప్రగడరమణ మూర్తి, దొండపాటి నాగసత్యనారాయణమూర్తి సత్తిమంగిరెడ్డి , సత్తిసాయికిరణ్ రెడ్డి తదితరులుపాల్గొన్నారు



# కమనీయం.. " మహా శివరాత్రి " వైభవం

## ఆలయాలు ముస్తాబు.. పలుచోట్ల లింగోద్భవ అభిషేకాలు

## నేడు మహా శివరాత్రి పర్వదినం

**అనపర్తి, మార్చి 7 , ప్రభాతవార్త :**

శివోహం.. శివోహం.. శివోహం.. ప్రతి భక్తుడు మది పులకించే పంచాక్షరీ మంత్రం ఓం నమః శివాయ .. శైవాచారం లో విశేష పండుగ మహా పర్వదినం మహా శివరాత్రి . ఒకప్పుడు భారత సంస్కృతిలో సంవత్సరానికి 365 పండుగలు ఉండేవి. ప్రతీ సందర్భానికి ఒక పండుగ ఉండేది. కానీ మహాశివరాత్రికి మాత్రం ఒక ప్రత్యేక విశిష్టత ఉంది. ప్రతీ చాంద్రమాన మాసం లోని 14వ రోజు లేదా అమావాస్యకు ముందు రోజుని మాస శివరాత్రి అంటారు. పంచాంగ సంవత్సరంలో వచ్చే పన్నెండు శివరాత్రులలో ఫిబ్రవరి %--% మార్చ్ లలో వచ్చేదానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారికి మహాశివరాత్రి ఎంతో ప్రముఖమైనది. కుటుంబ పరిస్థితులలో ఉన్నవారికి, ప్రపంచంలో గాఢమైన ఆకాంక్ష ఉన్నవారికి కూడా మహాశివరాత్రి ఎంతో ఆవశ్యకం. కుటుంబ పరిస్థితులలో నివ సించేవారు, మహాశివరాత్రిని శివుని పెళ్లిరోజుగా చూస్తారు. ప్రాపంచిక లక్ష్యాలతో ఉన్నవారు, ఈ రోజును శివుడు తన శత్రువులందరినీ జయించిన రోజుగా చూస్తారు. యోగ సంప్రదాయంలో శివుణ్ణి దేవుడిగా భావించరు, యోగ శాస్త్రానికి మూలకారకుడైన ఆదియోగి లేదా ఆదిగురువుగా చూస్తారు. ప్రతీ ఏటా మాఘ బహుళ చతుర్దశి నాడు చంద్రుడు శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర యుక్తుడైనప్పుడు వస్తుంది. శివుడు ఈ రోజే లింగాకారంగా ఆవిర్భవించాడని శివపురాణంలో ఉంది. హిందువుల క్యాలెండర్ నెలలో మాఘ మాసం కృష్ణ పక్ష చతుర్దశి. సంవత్సరంలో పన్నెండు శివరాత్రులలో మహా శివరాత్రి అత్యంత పవిత్ర ౕమైనదిగా భావింపబడుతుంది. మహా శివరాత్రి ఉత్సవాలకు గాను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక శివ క్షేత్రాలు ముస్తాబు అయ్యాయి. ముఖ్యంగా ద్రాక్షారామ, సామర్లకోట,కోటిపల్లి ,సోమేశ్వరం, పిఠాపురం, బిక్కవోలు ఇలా ఒకటేమిటి అన్ని శైవ క్షేత్రాలు నేడు భక్తుల పంచాక్షరీ మంత్ర నామస్మరణ తో మారుమ్రోగుతాయి.

**అర్ధరాత్రి అభిషేకం ప్రత్యేకత :**

పండుగ ప్రధానంగా ఈ మహా శివరాత్రి రోజున బిల్వ ఆకులు శివుడికి, సమర్పణల ద్వారా జరుపుకుంటారు. ఒక రోజంతా ఉపవాసం, రాత్రి అంతా జాగరణ చేసారు. ఇది శివ భక్తులకు అత్యంత పర్వదినం. ఈనాడు శివభక్తులు తెల్లవారుజామున లేచి, స్నానం చేసి, పూజలు చేసి, ఉపవాసం ఉండి రాత్రి అంతా జాగరణము చేసి మరునాడు భోజనం చేస్తారు . రాత్రంతా శివ పూజలు, అభిషేకములు, అర్చనలు, శివలీలా కథాపారాయణలు జరుపుతారు. అన్ని శివక్షేత్రాలలో ఈ ఉత్సవము గొప్పగా జరుగుతుంది . శైవులు ధరించే భస్మము/విభూతి తయారుచేయటానికి ఈనాడు పవిత్రమైనదని భావిస్తారు. రోజు అంతా భక్తులు "ఓం నమః శివాయ", శివ యొక్క పవిత్ర మంత్రం పఠిస్తారు. అదేవిధంగా పలుచోట్ల దేవాలయాల్లో అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకాలు జరుపుతారు. శివుడు జన్మించిన రోజుగా, శివ కళ్యాణం జరిగిన రోజు అని పలువురు భావిస్తూ ప్రత్యేక పూజలు, సంబరాలు జరుపుతారు.

**శివరాత్రి జాగరణ ప్రత్యేకత :**

రాత్రి అంటే మీకు విశ్రాంతిని ఇచ్చేది . రాత్రి అంటే అన్ని కార్యకలాపాలు ఆగిపోతాయి. అంతా నిశ్శబ్దంగా మరియు ప్రశాంతంగా ఉంది. పర్యావరణం ప్రశాంతంగా మారుతుంది మరియు శరీరం సహజంగా నిద్ర/విశ్రాంతి లోకి వెళు తుంది. రాత్రి అంటే మూడు రకాల సమస్యల





నుండి ఉపశమనం కలిగించేది: శరీరానికి, మనస్సుకు మరియు ఆత్మకు సమస్యలు – ఆధ్యాత్మికం , రాత్రి నిద్రపోతున్నప్పుడు, ఆహారం, నీరు లేదా బట్టలు గురించి చింతించరు. తద్వారా రోజులోని ఆందోళనల నుండి ఉపశమనం లభిస్తుంది. భౌతిక, మానసిక మరియు ఆధ్యాత్మిక మూడు అంశాల నుండి విశ్రాంతిని ఇచ్చేది రాత్రి . ఈ రాత్రి శివుడు మరియు శక్తి కలయికకు ప్రతీక, ఇది పర్యావరణాన్ని మరింత సజీవంగా చేస్తుంది. కాబట్టి మహా శివరాత్రి నాడు మెలకువగా ఉండటం శ్రేయస్కరం అని పెద్దలు చెబుతారు. శివరాత్రి సందర్భంగా ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ చేకూరనుంది.

# మరణశయ్య పై మూగ వేదన.

## వైద్యం అందుబాటులో లేక మరణిస్తున్న మూగ జీవాలు. ఉపాధి కోల్పోతున్న పాడి రైతులు.

**సీతానగరం మార్చి 7 ప్రభాతవార్త.**

మండలంలో పాడి పశువుల, పాడి రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. 21 గ్రామాలు పూర్తి వ్యవసాయ ఆధారిత గ్రామాలు కావడం అనుబంధంగా పాడి పరిశ్రమలో భాగంగా వందలాది పశువులు ఉన్నప్పటికీ పాడి పశువులు గాయాలు పాలై వైద్యం అందక మరణ సయ్య పై మూగవేదన అనుభవిస్తున్నాయి. వైద్యం అందని సందర్భంలో అనేక పశువులు మృత్యువాత పడుతున్నాయి. ప్రమాదంలో గాయపడిన అనారోగ్యం కలిగిన చికిత్స చేసే నాథుడు లేక మూగజీవాలు మౌనంగా రోదించడం తరువాత మరణించడంతో పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు లక్షలాది రూపాయల విలువైన పశువులను కోల్పోయి వీధిన పడుతున్నాయి. మండలంలో పదుల సంఖ్యలో కుటుంబాల వారు పశువులను మేపుకుంటూ పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ పరిస్థితులలో మండలంలో ఉన్న రెండు ప్రధాన పశు వైద్యశాలలలో కనీస సౌకర్యాలతో పాటు వైద్యులు కూడా లేకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన కొండేపూడి, వెదుళ్ళపల్లిలో రెండు పశు ఆసుపత్రులకు గాను ఒక్కరే వైద్యులు ఉన్నారు. ఉన్న ఒక్క డాక్టర్ కూడా అదనపు బాధ్యతలతో మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. చిన్న కొండేపూడిలో ప్రధాన వైద్యాధికారి లేకపోవడంతో సిబ్బంది తాత్కాలిక వైద్యం మాత్రమే చేస్తున్నారు. 25 కిలోమీటర్ల పరిధిలో రెండు ఆసుపత్రులు మాత్రమే ఉండగా ఆయా భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉన్న ఒక్క పశు వైద్యాధికారి నిరంతరం పై అధికారుల ఆదేశాల మేరకు ఇతర పనులకు సమయాన్ని కేటాయించడం వల్ల ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. ఇటీవల కాలంలో రాపాక పంచాయతీ పరిధిలో పలువురి పశువులు మరణించడానికి, వంగలపూడి గట్టుపై ఒక ఆవును బస్సు ఢీ కొన్న ఘటనలో వైద్యం అందకపోవడంతో మరణించాయి. మిర్తిపాడు, పురుషోత్తపట్నం కూనవరం, బాబ్బిల్లంక, ములకల్లంక గ్రామాల్లో అత్యధికంగా పశువులు ఉండగా ప్రభుత్వాలు ప్రతీ ఐదేళ్లకు పశు గణన చేస్తారు. 2018-19 లెక్కల ప్రకారం







మండలంలో పాడి గేదెలు 7000, ఆవులు 4500, మేకలు 3500, గొర్రెలు 3800, కుక్కలు 315, కోళ్లు 320, పందులు 250 ఉన్నాయి. ఇవన్నీ కేవలం గణాంకాల ప్రకారం అందుబాటులో ఉన్నవి కాగా అనధికారికంగా రెట్టింపు సంఖ్యలో ఉండొచ్చు. రాబోయే ఏడాది వేయబోయే లెక్కల ప్రకారం వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నా వైద్య సదుపాయాలు మాత్రం మెరుగు పడటంలేదు. పాడి పరిశ్రమ పేరుతో ప్రభుత్వాలు కేవలం తాత్కాలిక అంశాలపై దృష్టి పెడుతున్నాయే కానీ పాడి పశువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు. పాల వెల్లువ వంటి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే పశువులు వాటి సంక్షేమం కోసం కృషిచేసి క్షేత్ర స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలే కానీ పశు సంక్షేమం పట్టించుకోకుండా పాల ఉత్పత్తి పై దృష్టి పెట్టి మంచి ఫలితాలు ఆశించడం సరికాదు. ఇప్పటికైనా పశువులు ,పాల ఉత్పత్తి, పాడి రైతు అభివృద్ధికి చర్యలు తీసుకొని పాడి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని కోరుతున్నారు.

# జనసేన సిబ్బంది నివాసాల్లో తనిఖీలపై నిరశన

**అమలాపురం,మార్చి 7,ప్రభాతవార్త**

జనసేన పార్టీ కేంద్ర కార్యాలయ సిబ్బంది నివాసం ఉంటున్న అపార్ట్మెంట్లలో పోలీసు దాడులపై అమలాపురం లో జనసైనికులు ఆందోళన వ్యక్తం చేశారు.సిబ్బంది నివాసాల్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి దుర్భాసలాడి,అక్రమంగా సోదాలు నిర్వహించిన పోలీసు నిరంకుశ చర్యలకు నిరసనగా అమలాపురం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో నిరశన ప్రదర్శన చేశారు. నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయం నుండి స్థానిక గడియార స్తంభం సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసించారు.ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ అయినా ఐదు సంవత్సరాలు మాత్రమే అధికారంలో ఉంటుందని ప్రభుత్వాధికారులైనా పోలీస్ అధికారులైనా 60 సంవత్సరాలు సర్వీస్ లో ఉంటారని వైసిపి ప్రభుత్వం ఉంటే రేపు రాబోయేది తెలుగుదేశం ,జనసేన పార్టీ ప్రభుత్వం అని,ప్రభుత్వ అధికారయంత్రాంగం,పోలీసు వ్యవస్థ అది గుర్తెరిగి విజ్ఞతతో వ్యవహరించాలని ఉద్బోధించారు. లేనిపక్షంలో తీవ్రమైన చర్యలు ఉంటాయని రాజబాబు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ రాష్ట్ర,జిల్లా నాయకులు జనసైనికులు వీరమహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు



# మహాశివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబు.

**ఆత్రేయపురం, మార్చి 7( ప్రభాత వార్త )**



ప్రముఖ దేవాలయాలకు నిలయమైన ఆత్రేయపురం మండలం వివిధ గ్రామాల లో గల ప్రధాన శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా ర్యాలీ శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం, ఉమా మార్కండేయ స్వామి ఆలయం, వాడపల్లి శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి ఆలయం, వసంతవాడ శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి వారి ఆలయం, ఆత్రేయపురంలో అతి పురాతనమైనశ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజేశ్వర స్వామి ఆలయం, పేరవరం శివాలయం,తదితర ఆలయాలు ముస్తాబయ్యాయి. ఈ ఆలయాలను ఆలయ కమిటీలు, ఈవోలు, దేవాదాయ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వసంతవాడ శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి వారి ఆలయంలో రాత్రి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

# మత్స్యకారులకు ఓఎన్జీసి పరిహారం ఖాతాల్లో జమ - ఎమ్మెల్యే గొల్లపల్లి

**యానాం, మార్చి 7, ప్రభాతవార్త**

యానం నియోజకవర్గం యానం లోని 5,289 మంది మత్స్యకారులకు ఓఎన్జిసి నష్టపరిహారం ఈరోజు సాయంకాలం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ జమవుతుందన్నారు. గవర్నర్ తమిళ్ సైకి, ముఖ్యమంత్రి రంగస్వామికి, మత్స్య శాఖ మంత్రి లక్ష్మీనారాయణకి యానం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకారులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ అకౌంట్లో పడిన డబ్బులు ఎవ్వరికీ ఒక రూపాయి కూడా ఇవ్వనవసరం లేదని మీరే అనుభవించాలని ఎవరైనా మిమ్మల్ని డబ్బులు ఇవ్వమని బెదిరిస్తే పోలీసులుకు గాని ఎమ్మెల్యే అయినా నాకు గాని ఫిర్యాదు చేయాలని తెలిపారు.



# శ్రీ స్కంద బాలాజీ సూర్య దేవాలయమునకు విరాళం.

**గోకవరం మర్చి 7 ప్రభాత వార్త**

గోకవరం గ్రామంలో సనాతన ధర్మ ప్రబోధనా సమితి ఆధ్వర్యంలో దాతల ఆర్థిక సహాయంతో నిర్మిస్తున్నటువంటి శ్రీ స్కంద బాలాజీ సూర్యదేవాలయమునకు గోకవరం వాస్తవ్యులు చిటికెల పాండు 1,18,000/ రూపాయల ఖరీదు చేసే 20వేల ఇటుకలను విరాళంగా అందించినారు.ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తోట సాయిబాబా ప్రధాన కార్యదర్శి అక్షింతల రాజా మాట్లాడుతూ గోకవరం మండలంతో పాటుగా చుట్టుపక్కల అనేక గ్రామాలలో హిందూ ధర్మ పరిరక్షణ ప్రధాన ధ్యేయంగా సమితి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు స్పందించిన దాతలు స్వచ్ఛందంగా సమితికి విరాళాలు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పిల్లంగోరు పాపారావు,కొరిపిల్లి అప్పలస్వామి, తాటికొండ శ్రీనివాస్,ఏనుగు శ్రీను, సంగుల చక్కరరావు తదితరులు పాల్గొన్నారు.



# కొత్తపల్లి తహశీల్దారుగా సుందర రాజు

**యు.కొత్తపల్లి, మార్చి 7 ప్రభాతవార్త**



కొత్తపల్లి మండల తహశీల్దారుగా సుందర రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం నుండి బదిలీపై కొత్తపల్లి రావడం జరిగింది. ఇప్పటివరకు విధులు నిర్వహించిన రాజ్ కుమార్ పెదపూడి మండలం తహశీల్దారుగా బదిలీపై వెళ్లారు.

# వ్యాఘ్రేశ్వరంలో అగ్నిష్టోమ యాగం..

**అంబాజీపేట,మార్చి 7, ప్రభాతవార్త..**

మండలంలోని వ్యాఘ్రేశ్వరంలో ఈ నెల 11 నుండి అగ్నిష్టోమ యాగం నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ గురువారం తెలిపింది.ఈ యాగం శ్రౌత యాగమని, వ్యాఘ్రేశ్వరంలో ఈ యాగాన్ని 1968,1969 సంవత్సరాలలో నిర్వహించారని తెలిపారు. 2008లో ఆకెళ్ళ రామకృష్ణ సోమయాజి దంపతులచే మరోసారి అగ్నిష్టోమ యాగం నిర్వహించారని కమిటీ సభ్యులు తెలిపారు.ఈ నెల 15 వరకు జరిగే అగ్నిష్టోమయాగం, ప్రస్తుత రోజులలో చాలా అరుదుగా నిర్వహిస్తారని పేర్కొన్నారు.2024 లో మరోసారి రామకృష్ణ సోమయాజి దంపతుల జ్యేష్ట కుమారుడైన ఆకెళ్ళ వ్యాఘ్రేశ్వర వెంకటరామ సూర్య సుబ్రహ్మణ్య నరసింహ హవిర్యాజి శర్మ నిర్వహిస్తారని వివరించారు. ఆసక్తిగల భక్తులు విచ్చేసి,యాగ క్రతువును తిలకించి, యజ్ఞ ప్రసాదము, నిత్య అన్నసమారాధన స్వీకరించి యజ్ఞేశ్వర కృపకు పాత్రులు కాగలరని కోరారు.లోక కళ్యాణార్థం జరుగుతున్న యాగానికి యధాశక్తి విరాళములు పంపి యాగ నిర్వహణలో భాగస్వాములు కాగలరనియాగ కార్యనిర్వాహక కమిటీ, గ్రామస్థులు కోరుతున్నారు.

# అర్హులందరికీ ఇల్లు.. ఇదే వైసిపి ప్రభుత్వ లక్ష్యం

## 376 మందికి ఇళ్ల పట్టాలు పంపిణి

**అనపర్తి , మార్చి 7, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో ఇళ్ళు లేని నిరుపేదలు అందరికి స్వంత ఇంటి కల నెరవేరాలనే సంకల్పంతో జగన్ ప్రభుత్వం కృషి చేస్తూ అర్హులు అందిరికి ఇంటి పట్టాలు అందించిన ఘనత సాధించిందని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మండల పరిధిలో పొలమూరు గ్రామంలో నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో భాగంగా 376 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు . స్థానిక డి ఎన్ ఆర్ గ్రౌండ్స్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడుతూ, అనపర్తి నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. కుల, మత, పార్టీ వివక్షత చూపకుండా వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తించి ఇళ్ల స్థలాలు అందింకేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయాలని కోరారు. పొలమూరు గ్రామంలో సుమారు 40 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా అయన ప్రజలకు వివరించారు. గ్రామ ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, జెడ్పిటిసి సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో చేపట్టిన అభివృద్ధిని చూసి మళ్ళి జగన్ ప్రభుత్వానికి ఓటు వేసి అభివృద్ధికి చేయూత అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి అధ్యక్షుడు సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జెడ్పి మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు



# 4 వ విడత వైయస్సార్ చేయూత నిధులు విడుదల

**అనపర్తి , మార్చి 7, ప్రభాతవార్త :**

అనపర్తి గ్రామంలో నాలుగవ విడత చేయూత పథకం ద్వారా అనపర్తి మండలానికి మంజూరైన రూ 5.01 కోట్ల ఆర్ధిక సహాయాన్ని 2672 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయ రెడ్డి గురువారం పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ , వైయస్సార్ చేయూత పథకం ద్వారా 45-60 ఏళ్ల మధ్య వయస్సు గల పేద ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనారిటీ మహిళలకు ప్రతి సంవత్సరానికి 18,750 రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించడం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందని అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి చేయూత పథకాన్ని ప్రవేశపెట్టి దులో భాగముగా 4 వ విడత నిధులు మంజూరు చేయడం అభినందనీయమని తెలిపారు. అంతకు ముందుగా ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం జరిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి ( రాంబాబు), పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి..ఎంపీపీ దొమ్మేటి..

**అంబాజీపేట, మార్చి 7, ప్రభాతవార్త..**

నేటి మహిళలు వ్యవసాయ, ఉద్యోగ,ఉపాధి,వ్యాపార రంగాలతో పాటు అంతరిక్షయానంలోను దూసుకుపోతున్నారని, విద్యతోనే అన్ని రంగాలపై అవగాహన కలుగుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు.అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. సమాజంలో మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవల్సిన బాధ్యత ప్రతీ ఒక్క మహిళపై ఉందన్నారు.మహిళా సాధికారిత దిశగా అడుగులు వేయాలన్నారు.అనంతరం ఇన్చార్జి ఎంపీడీఓ, ఈఓపిఆర్డి బి.మమతను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ బి.చంద్రమోహన్,ఎం బాలామణి, సలాది నాగలక్ష్మి, గుత్తుల సాయికృష్ణ, ఆదిత్య, మౌనిక, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# యోగా సెంటర్ లో ముందస్తు మహా శివరాత్రి వేడుకలు.

**మామిడికుదురు.మార్చి07 ప్రభాతవార్త.**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మామిడికుదురు లోని ఖేతన యోగా కేంద్రంలో గురువారం ముందస్తు మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.బ్రహ్మ కుమారి పతాకాన్ని రాజోలు బ్రహ్మ కుమారి కేంద్రం ప్రతినిధి బీ.కే.మణి ఆవిష్కరించారు.పరమాత్ముడు ఒక్కడే అనే నినాదంతో అందరూ ముందుకు సాగాలని ఆమె పేర్కొన్నారు.ఈ వేడుకల్లో యోగా గురువు ఆకుల ఖేతన్,కోట బ్రహ్మానందం, మెండా ఆదినారాయణ,కంచి నాగరాజు,కదలి నూకరాజు,బత్తుల శ్రీదేవి,సీత,లీల,రాజేష్,శ్రీను,నానాజీ,యోగా సాధకులు పాల్గొన్నారు.



# స్వార్ధ ప్రయోజనాల కోసం జాతిని తాకట్టు పెట్టొద్దు.....కాపునాడు

**అమలాపురం,మార్చి7,ప్రభాతవార్త**

కాపు కులస్తులను రానున్న ఎన్నికలలో ఓటు బ్యాంకులుగా చూడవద్దని ఏ పార్టీకి చెందిన నాయకులైన కాపు సామాజిక వర్గ మనోభావాలను పరిగణలోకి తీసుకుని వారికి అందవలసిన రిజర్వేషన్ సదుపాయాలను కల్పించాలని రాష్ట్ర కాపునాడు అధ్యక్షులు పురంశెట్టి మంగారావు డిమాండ్ చేశారు.కాపు నేతలు చేగొండి హరిరామ జోగయ్య, ముద్రగడ పద్మనాభం ల ద్వయం వారి వారసత్వ ప్రయోజనాల కోసం, స్వార్ధ రాజకీయాలకు తెరతీసారని కాపు ఇతర ఉప కులాలు ప్రజలు వారిని అనుసరించే ప్రశ్నేలేదన్నారు. కాపులను వెనుకబడిన తరగతులుగా గుర్తించి తక్షణమే రిజర్వేషన్ సదుపాయాలు కల్పించే సత్తా ఉన్న రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పొందుపరచాలని కోరారు.అమలాపురంలో కాపునాడు కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో కాపునాడు కీలకపాత్ర పోషించి కాపులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తుందన్నారు.సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర కాపునాడు కార్యనిర్వాహక అధ్యక్షులు అబ్బిరెడ్డి సురేష్ మాట్లాడుతూ వెనుకబాటు తనంలో మగ్గుతున్న కాపు,తెలగా,బలిజ ఒంటరి, మున్నూరు ఉప కులాల అభివృద్ధికి రాజకీయ పార్టీలు డిక్లరేషన్ ప్రకటించాలని కోరారు. కాపు డిక్లరేషన్ లో భాగంగా 20 అంశాలతో కూడిన డిక్లరేషన్ను ఆయన విడుదల చేసి అమలు చేయాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ముందుగా స్వర్గీయ వంగవీటి మోహన రంగారావు,పిల్లా వెంకటేశ్వరరావు,అబ్బిరెడ్డి రామదాసుల విగ్రహాలకు పూల మాలలు వేసి ఘననివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లాలో వివిధ నియోజకవర్గాలకు,మండలాలకు చెందిన కాపునాడు కన్వీనర్లకు నియామక పత్రాలు అందచేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కాపునాడు నాయకులు పత్తి దత్తుడు గంగుమళ్ళ శ్రీనివాస్,త్సవటపల్లి నాగు,ఉంగరాల అబ్బులు,కాయల సూరిబాబు,కోటిపల్లి ధర్మరాజు, కాకిలేటి దుర్గారావు,తోట శ్రీనివాసరావు,నంద్యాల చంటి, పోతు కాశి,యాత్రా గణపతి తదితరులు పాల్గొన్నారు.



# సంచార జాతులకు టిడిపితోనే గుర్తింపు..

## రాష్ట్ర బీసీ సాధికార ఎంబీసీ కన్వీనర్ రమేష్..

**అంబాజీపేట,మార్చి 7, ప్రభాతవార్త..**



సంచార జాతులకు టిడిపితోనే గుర్తింపు లభించిందని, రాబోయే టిడిపి,జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో సంచార జాతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామనడం హర్షణీయమని రాష్ట్ర బీసీ సాధికార ఎంబీసీ కన్వీనర్ పెంద్ర రమేష్ అన్నారు. అంబాజీపేటలో 'ప్రభాతవార్త'తో పెంద్ర రమేష్ గురువారం మాట్లాడుతూ గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన జయహో బీసీ సభలో టిడిపి,జనసేన సంయుక్తంగా బీసీ డిక్లరేషన్ ప్రకటించాయన్నారు. దీంట్లో ఎంబిసిలకు స్థానిక సంస్థల్లో 5 శాతం రిజర్వేషన్లు, దేవాలయాల పాలకమండల్లో సభ్యత్వం,మున్సిపల్ కార్పొరేన్లలో ఎస్సీ,మైనార్టీల వలే కో-ఆప్షన్ మెంబర్లుగా సంచార జాతులకు అవకాశం, గతంలో ఇచ్చిన 100 యూనిట్లు ఉచిత విద్యుత్ 200 యూనిట్లకు పెంపు,బీసీలకు 50 ఏళ్లకే నాలుగు వేలు పింఛను అమలు, బీసీలపై దాడులు, దౌర్జన్యాలను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం,బిసి సబ్ ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ. లక్షన్నర కోట్లు ఖర్చు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ ను వైసీపీ ప్రభుత్వంలో 34 శాతం నుండి 24 శాతానికి తగ్గించడంతో 16,800 పదవులను దూరం చేసిందని, టిడిపి,జనసేన అధికారంలోకి వచ్చాక 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ, చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక, అన్ని స్థానిక నామినేట్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు, బీసీలకు చంద్రన్న భీమా రూ.10 లక్షలకు పెంపు,పెళ్లి కానుక లక్ష రూపాయలకు పెంపు,బీసీ కార్పొరేషన్ లో జనాభా సంఖ్య పరంగా బడ్జెట్ కేటాయిస్తామని ప్రకటించడం హర్షణీయమని రమేష్ తెలిపారు.బీసీ డిక్లరేషన్ జయహో బీసీ సభలో ఎంబిసి కూడా స్థానం కల్పించినందుకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్ కళ్యాణ్, టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చె న్నాయుడు,మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, పితాని సత్యనారాయణ, నాయకులు దువ్వరపు రామారావులకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే గొల్లపల్లి

**యానాం, మార్చి 7, ప్రభాత వార్త:**

యానాం నియోజకవర్గం యానాం ప్రజా పనుల శాఖ ద్వారా కోటి 20 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ భూమి పూజ చేశారు. డాక్టర్ ఎస్.ఆర్.కె.ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అకడమిక్ భవనంకు సంబంధించి రెండవ అంతస్థు నిర్మాణానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కర రెడ్డి, సూపరింటెండెంట్ బచ్చల విజయసాగర్,ప్రజాపనులశాఖ ఈఈ ఆర్.చంద్రశేఖరన్,కళాశాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కనకాలపేట లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలల్లో పలు అభివృద్ధి, మరమ్మతు పనులకు ఎమ్మెల్యే గొల్లపల్లి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా పనుల శాఖ అధికారులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




# గోకవరం లో ఘనంగా వుమెన్స్ డే

**.గోకవరం.మార్చి7: ప్రభాత వార్త**

గోకవరం.అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కమ్యూనిటీ పారామెడిక్స్%ఁ%ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గోకవరం మండలం ఆధ్వర్యంలో గురువారం గోకవరం పోలీస్ స్టేషన్ లోని మహిళా కానిస్టేబుల్స్ దుర్గా భవానీ, జ్యోతి, అశ్విని, శారద దేవి,భారతి లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కే నాగరాజు మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా మూర్తులను గౌరవించుకోవడం మనందరి భాద్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పీ దేవానందం, జిల్లా కోశాధికారి పీ చిన్ని, మండల అధ్యక్షులు ఎమ్ నాగేశ్వరరావు, కార్యదర్శి వై పవన్ కుమార్,జి వెంకటేష్, సహాయ కార్యదర్శి జే మూర్తి,ఐ నాగేశ్వరరావు, సీహెచ్ విశ్వేశ్వరరావు,బాలాజీ ప్రసాద్, కానిస్టేబుల్స్ సిబ్బంది పాల్గొన్నారు.



# సర్కార్ ఎక్స్ ప్రెస్ కాకినాడ నుండి పుదుచ్చేరి వరకు పొడిగింపు..

## ఎమ్మెల్యే గొల్లపల్లి

**యానం మార్చి 7, ప్రభాతవార్త:**

యానం నియోజకవర్గం యానం సర్కార్ ఎక్స్ ప్రెస్ కాకినాడ నుండి పుదుచ్చేరి వరకు పొడిగించారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. సర్కార్ ఎక్స్ ప్రెస్ పొడిగింపు ఏప్రిల్ మూడో తేదీ నుండి అమలులోకి వస్తుంది అన్నారు. వారంలో ఒక్క బుధవారం తప్ప మిగతా అన్ని రోజులు పుదుచ్చేరి వెళ్తుందని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పుదుచ్చేరి వరకు ట్రైన్ లేకపోవడంతో యానం నుండి వెళ్లే ఉద్యోగులు, సందర్శకులు, రోగులు చాలా ఇబ్బంది పడే వారిని కాకినాడ నుండి పుదుచ్చేరి వరకు ట్రైను పొడిగించడంతో ఈ సమస్య పరిష్కారం అయిందన్నారు. ఎన్నోసార్లు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని గత సంవత్సరం అసెంబ్లీలో డిమాండ్ చేశానన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్కి, పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామికి , హెూం మంత్రి నమశ్శివాయంకి , స్పీకర్ సెల్వంకి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

# నామన ఫౌండేషన్ ద్వారా దుప్పట్లు,పండ్లు పంపిణీ.

**మామిడికుదురు.మార్చి07 ప్రభాతవార్త.**

నామన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరు పేదలు 200 మందికి దుప్పట్లు, పండ్లతో పాటు ఇద్దరు యువతులకు రూ.50 వేలు ఖరీదుచేసే చెవి కమ్ములను అందించారు.ఈ సందర్భంగా మగటపల్లి గ్రామంలో గురువారం నామన ఫౌండేషన్ ఆధ్వర్యంలోజరిగిన సమావేశంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్,ఫౌండేషన్ అధ్యక్షుడు నామన రాంబాబు మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు,అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తామన్నారు. నామన కృష్ణవేణి స్మారకార్థం ఏర్పాటు చేసిన సమావేశంలో వీటిని పేదలకు పంపిణీ చేశారు.తమ కుటుంబ సభ్యుల సహకారంతో ఈ ఫౌండేషన్ ను ఏర్పాటు చేశామని నామన తెలిపారు.ప్రతీ ఏడాది దీని ద్వారా పేదలకు సహకారం అందిస్తామన్నారు.అమెరికాలో ఒక ఏడాది నుంచి అమ్మ ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తున్నట్టు ఎన్నారై ఎం.డి.కార్డియాలజిస్ట్ నామన వినోద్,ఎండి.జనరల్ మెడిసిన్ నామన శృతి తెలిపారు.ఇకపై తమ స్వగ్రామమైన మగటపల్లిలో కూడా సేవలు అందిస్తామన్నారు.టెలీ మెడిసిన్,టెలీ విజిట్,ల్యాబ్ ను ప్రారంభించి యాంజియో గ్రామ్ తదితర సేవలు అందించాలన్నదే తమ ఉదేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి నరసింహారావు,బొలిశెట్టి రాంబాబు,బొలిశెట్టి మాధవ, తిరుమల శ్రీనివాస్,వడ్డే సంపత్,టి. మురళీకృష్ణ,బొలిశెట్టి జయరాం తదితరులు పాల్గొన్నారు.




# మాజీ సర్పంచ్ జగ్గారావును కలిసిన ఏలూరు ఎంపీ కోటగిరి

**గండేపల్లి మార్చి 7 (ప్రభాతవార్త):**

గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట గ్రామ మాజీ సర్పంచ్ ఐ. వి జగ్గారావుకు సమీప బంధువైన ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ గురువారం ఉదయం నీలాద్రిరావు పేట జగ్గారావు గృహానికి వచ్చారు.కొంత సమయం వారి కుటుంబ సభ్యులతో స్థానిక వైసిపి నాయకులు తో ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో గండేపల్లి ఎంపీపీ చలగల్ల దొరబాబు,మండల పార్టీ అధ్యక్షులు మద్దిపట్ల రామకృష్ణ, గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్ బాబు, వైఎస్ఆర్సిపి నాయకులు పాలచర్ల వెంకన్న చౌదరి,తాళ్ళూరి మధు కుమార్, గ్రామ వైసిపి నాయకులు ఇనుగంటి గోపాలకృష్ణ (గోపీ), గ్రామ పార్టీ అధ్యక్షులు కాకి శ్రీను,మట్టా బాపిరాజు, గెడ్డం సురేంద్ర, మట్టా శ్రీను, గ్రామ వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# పేదల సంక్షేమం ,అభివృద్ధి సీఎం జగన్ ధ్యేయం

## ఇళ్ల పట్టాలు, చేయూత పంపిణీ లో ...మంత్రి విశ్వరూప్ , ఎమ్మెల్సీ కుడిపూడి.

**అమలాపురం టౌన్, మార్చి 07 ప్రభాతవార్త.**

గతంలో ఎన్నడూ జరగని విధంగా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళు మాదిరిగా అత్యంత పారదర్శకంగా వివక్షతకు తావు లేకుండా, వాటి అమలు ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. అమలాపురం పట్టణంలో గురువారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ప్రారంభోత్సవం, ఇండ్ల పట్టాల పంపిణీ, వైఎస్సార్ చేయూత కార్యక్రమాల్లో ముఖ్య అతిధులుగా మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ రావు లు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి,మున్సిపల్ కమీషనర్ ఎస్.మనోహర్ ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో ముందుగా అమలాపురం పట్టణం 27 వార్డు నందు జాతీయ అర్బన్ హెల్త్ మిషన్ నిధులైన ఒక కోటి ఐదు లక్షలతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 16 కోట్ల వెచ్చించి కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలను 2,772 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో 1463 మంది లబ్ధిదారులకు వైయస్సార్ చేయూత 4 విడత జమ రెండు కోట్ల 74 లక్షల 30 ఒక వెయ్యి రెండు వందల యాభై రూపాయలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ జరిగిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పినిపే శ్రీకాంత్, వైసీపీ సీనియర్ నాయకులు, పి గన్నవరం ఎన్నికల అబ్జర్వర్ చెల్లుబోయిన శ్రీనివాస్, వైసీపీ జిల్లా బి సి సెల్ అధ్యక్షులు మట్టపర్తి నాగేంద్ర,పట్టణ వైసీపీ అధ్యక్షులు సంసాని చంద్రశేఖర్, వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి గీత, వైస్ చైర్మన్ రుద్ర రాజు వెంకటరాజు, వార్డు కౌన్సిలర్లు



గొవ్వాల రాజేష్, నాగారపు వేంకటేశ్వర రావు, చిట్టూరి పెదబాబు, కొల్లాటి దుర్గాబాయి, వాసర్ల లక్ష్మి సుబ్బారావు, దొంగ నాగ సుధా రాణి చిన్నా,యన్నాబత్తుల పద్మ, గోపి రాజీ రమేష్, చిత్రపు రామకృష్ణ,కట్టోజు సన్నాయి దాసు, బండారు గోవిందు,యండమూరి గంగా శ్రీను,వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదర్,కో ఆప్షన్ సభ్యులు వంకాయల కాశీ విశ్వేశ్వర రావు,జాన్సన్ బిల్లీ,ఖ్వాజా బాబు,మార్కెట్ యార్డు చైర్మన్ దంగేటి డోల మణి రుద్ర,జెడ్పీటీసీ పందిరి శ్రీహరి, వైసీపీ సీనియర్ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కర్రి వీర రాఘవులు, కల్వకొలను ఉమ,విత్తనాల మూర్తి,సిహెచ్ రవి శంకర్, కల్వకొలను బాబీ, వైసీపీ నాయకురాలు సుంకర లక్ష్మి కుమారి , సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్దిదారులు, అభిమానులు తదితరులు హాజరయ్యారు.

# వాడపల్లి వెంకన్న ఆలయంలో ఘనంగా లక్ష తులసి పూజ.

**ఆత్రేయపురం, మార్చి 7( ప్రభాతవార్త )**

కోనసీమ తిరుమల గా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం ఘనంగా లక్ష తులసి పూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఆల ఈవో బీహెచ్ విఎస్ఎన్ కిషోర్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. టీటీడీ వేద పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆచార్యులు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు,వేద పండితుల బృందం సభ్యులు ఆగమ శాస్త్రానుసారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత మండపారాధన, అభిషేకము, అగ్ని మదనము, లక్ష్మి తులసి పూజ, అమ్మవారికి కుంకుమార్చన, మహా పూర్ణాహుతి, శాంతి కళ్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలోదంపతులు భక్తులు, సామూహిక అర్చనలలో పాల్గొన్నారు. అలాగే ఆలయం ఎదురుగా నిర్మించే కోనేటి ఆధునీకరణ పనులను దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులు సౌకర్యార్థం వసతులు కల్పనకు ఆలయ పర్యవేక్షకులు రాపాక శ్రీనివాస్, శ్రీదేవి, కమిటీ సభ్యులు పి సురేష్ రాజు, మెర్ల వెంకటేశ్వరరావు, మన్యం సూర్యకుమారి భాను, రొట్టె రాజేశ్వరి రాజబాబు, కే శారదాంబ శ్రీనివాస్, ఏపుగంటి కనకారావు, శనగన సత్యనారాయణ, వాడపల్లి వెంకట సత్య సాయి, ఆలయ అర్చకులు సిబ్బంది సహకరించారు.



# ప్రజలను ఆకర్షిస్తున్న చంద్రన్న సూపర్ సిక్స్ పథకాలు

## యనమల కృష్ణ

## తొండంగి లో భారీగా పార్టీలోచేరికలు

**తొండంగి /శంఖవరం మార్చి 7 ప్రభాతవార్త**

చంద్రన్న ప్రవేశ పెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజలును విశేషంగా ఆకర్షిస్తున్నాయని దీంతోనే పార్టీలో భారీ ఎత్తున చేరికలు జరుగుతున్నాయని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణ పేర్కొన్నారు. గురువారం తొండంగి గ్రామ నాయకులు ప్రకృతి భవాని ప్రకృతి నాగ సత్యనారాయణ తోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ లో చేరారు . వీరందరికియనమల కృష్ణుడు పసుపు కండువాలు వేసి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీకి నిస్వార్ధ సేవలు అందించే కార్యకర్తలను గుర్తించి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా తెలుగుదేశం పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. వాలంటీర్ ఉద్యోగానికి రిజైన్ చేసి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పేకేటి హరికృష్ణ జనసేన నాయకులు ,బెండపూడి నాయుడు, మురాల శెట్టి సత్తిబాబు దూలం మురళీకృష్ణ పసుపులేటి రాంప్రసాద్ వెలుగుబంటి నాగు , దుర్గాప్రసాద్ పిల్లి బాబ్జి మరియు తెలుగుదేశం జనసెన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు



# ఆదిత్యలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**గండేపల్లి మార్చి 7 (ప్రభాతవార్త):**

గండేపల్లి మండలం సురంపాలెం ఆదిత్య విద్యాప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్యాంపస్ నందు మూడు ఇంజనీరింగ్,ఫార్మసీ పాలిటెక్నిక్ బిజినెస్ మేనేజ్మెంట్ స్కూల్ నందు ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. మహిళా సిబ్బంది కి శుభాకాంక్షలు తెలియజేసి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీ లేని రంగాలను ఊహించలేమని, నింగి,నేల తేడా లేకుండా ఎక్కడైనా విద్య,వైద్య, ఆర్థిక,సామాజిక,రాజకీయ,పారిశ్రామిక తదితర ఏ రంగంలో అయినా పురుషులకు దీటుగా సమర్ధవంతంగా తన ప్రతిభను చాటుతూ మహిళలు ముందుకు దూసుకుపోతున్న విషయాన్ని ఉదాహరణలతో వివరించి వారి సేవలను కొనియాడారువిద్యార్థుల భవిష్యత్తు పై సోషల్ మీడియా ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. 1980 ప్రాంతం వరకు మహిళలు కేవలం వంటింటికే పరిమితం అయ్యేవారు ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయని స్త్రీ పురుష అనే బేధం క్రమం గా అంతరించి పోతుంది అని, కానీ నేటి విజ్ఞాన వంతమైన సమాజంలో స్త్రీ పై ఆకృత్యాలు,దాడులు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 75 సంవత్సరాల ఈ స్వతంత్ర భారతదేశంలో గాంధీజీ కలలు గన్న విధంగా స్త్రీ స్వేచ్ఛగా రాత్రులు తిరగడం కాదు కదా పగలు కూడా ఒంటరిగా తిరిగే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను గౌరవించలేని సమాజం మృగాలతో సమానం అని అన్నారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛాయుత సమాజం కోసం మహిళల పట్ల గౌరవ భావం కలిగి ఉండే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బంది ని దుశ్శాలువా జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమాలలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ డా. ఎం.శ్రీనివాసరెడ్డి, డా.డోలా సంజయ్, డా.ఎ.రమేష్, డా. కె.రవిశంకర్, డా.డి.సతీష్ కుమార్,డా. సంజయ్ కుమార్, ఎస్.టి.వి.ఎస్. కుమార్,ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ గ్రంథాలయ విభాగం, ఎన్.ఎస్.ఎస్. విభాగం, సాంస్కృతిక విభాగాల సభ్యులు మహిళా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# అక్రమంలో విక్రయం..!

## ఆక్వా సబ్సిడీ విద్యుత్తు విచ్చలవిడిగా విక్రయాలు..!

## చోద్యం చూస్తోన్న విద్యుత్తు శాఖ..

## సీఆర్‌జడ్ పరిధిలో అనధికార కనెక్షన్లు

## మాటున దందా..

## అల్లవరం మండలం తీరం కేంద్రంగా అక్రమాల జోరు..

**అల్లవరం, మార్చి 07, ప్రభాతవార్త:**

సముద్రతీరంలో డీ పట్టా భూముల్లో అక్రమంగా తవ్వి సాగు చేస్తోన్న ఆక్వా చెరువులకు విద్యుత్తు వినియోగం ఎంత అక్రమమో... ఆ అక్రమంలో కూడా మరో అక్రమానికి తెరతీస్తున్నారు కొందరు.. సీఆర్‌జడ్ పరిధిలో చేయకూడని ఆక్వాసాగుకు అక్రమంగా విద్యుత్తు కనెక్షన్లు పొంది ఆపై ఆ విద్యుత్తును యూనిట్లు చొప్పున పక్క చెరువుల సాగుకు అమ్ముకుంటూ సొమ్ములు చేసుకుంటున్నారు కొందరు..

అల్లవరం మండలంలోని కొమరగిరిపట్నం, ఓడలరేవు తీరంగా జరుగుతోన్న ఈ విద్యుత్తు అక్రమ విక్రయాల తంతు సదరు విద్యుత్తు శాఖకు ఎరుకే అయినా మామూళ్ల మత్తులో తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..

**అక్రమ విక్రయాలు ఇలా...**

కొమరగిరిపట్నం, ఓడలరేవు సముద్రతీరానికి ఆనుకుని సాగుతోన్న ఆక్వాసాగుకు సంబంధించి దాదాపు 90 శాతం చెరువుల వద్ద ఏరియేటర్లు, మోటార్లు తదితర అవసరాలకు విద్యుత్తునే వినియోగిస్తున్న పరిస్థితి అక్కడ ఎక్కడ చూసినా కంట పడుతోంది.. సముద్రానికి ఆనుకుని ఉన్న ఈ ఆక్వా చెరువులుకు అసలు అనుమతులు ఎలా వచ్చాయన్న యక్షప్రశ్నకు సమాధానం లేకపోగా విచిత్రంగా అక్కడున్న ప్రతీ చెరువు విద్యుత్తు వినియోగంలో ఉండడం కనిపిస్తుంది.. ఇంతకీ అసలు సంగతి ఏంటంటే.. వేరే జిరాయతీ భూమికి తాలూకు సర్వే నెంబర్, యజమాని పేరున ఆక్వా అనుమతులతోపాటు విద్యుత్తు సర్వీసు పొంది ఆపై తీరంలో ఉన్న చెరువుల వద్ద అదే కనెక్షన్ పొందారు. ఇంతటితో ఆగక ఇచ్చిన పరిమితికి మించి అదనంగా కేబుల్స్ ద్వారా విద్యుత్తు సరఫరాను ఇతరుల చెరువులకు మళ్లిస్తున్నారు. ఇలా విద్యుత్తును అనధికారికంగా మళ్లించి విక్రయించడం ద్వారా యూనిట్‌కు రూ.4 నుంచి రూ.5 వరకు అదనంగా అక్రమ ఆదాయాన్ని పొందుతున్నారు. ఈ దందా కొమరగిరిపట్నం, ఓడలరేవు తీరప్రాంతం కేంద్రంగా మూడు ఏరియేటర్లు... ఆరు యూనిట్లు చందంగా సాగుతోంది..





**హెచ్‌పీల లెక్కన విక్రయాల జోరు...**

ఆక్వాసాగుకు సంబంధించి ఒక్కో యూనిట్‌కు రూ.1.50 చొప్పున ప్రభుత్వం రాయితీపై ఇస్తోంది.. అదే రాయితీ లేని కనెక్షన్‌కు సంబంధించి యూనిట్‌కు రూ.7 చొప్పున చెల్లించాల్సిన పరిస్థితి.. ఈనేపథ్యంలో ఒక్క కనెక్టెడ్ లోడు నుంచి రోజుకు ఒక్కో కనెక్షన్‌కు 40 నుంచి 50 హెచ్‌పీల స్థాయి వరకు విద్యుత్తును అక్రమంగా అమ్ముకుంటున్నారు. ఉదాహరణకు ఒక ఎకరం చెరువుకు 10 హెచ్‌పీల చొప్పున రోజుకు 20 గంటల వినియోగం ఉంటుంది.. దీనిని బట్టి ఒక ఎకరం చెరువుకు రోజుకు 200 యూనిట్లు నుంచి 250 వరకు ఖర్చు అవుతుంది.. విత్యుత్తు వినయోగానికి ఎటువంటి పరిమితి లేకపోవడంతో ఒక హెచ్‌పీ వినియోగానికి రూ.250 చొప్పున వసూళ్లు చేస్తూ రోజుకు 40 నుంచి 60 హెచ్‌పీల స్థాయి వరకు విద్యుత్తును అక్రమంగా అమ్ముకుంటున్నారు. ఇలా కనెక్టెడ్ లోడ్‌ను మించి ప్రతీ కనెక్షన్ దారుడు ఎడిషనల్ లోడ్‌కు కూడా బిల్లు చెల్లించి మరీ విద్యుత్తును అమ్ముకోవడం ద్వారా నెలకు రూ.లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు..

**అధికారులేం చేస్తున్నారు..?**

సముద్రతీరంలో ఆక్వాచెరువుల వద్ద విద్యుత్తు కనెక్షన్లు పూర్తిగా అక్రమమని తెలిసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా వాటికి ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయడం, కనెక్షన్లు ఇవ్వడం సదరు విద్యుత్తు శాఖ కనుసన్నల్లోనే జరిగిపోయాయి. అయితే ఈ అక్రమంలోనే మరో అక్రమానికి తెరతీసి విక్రయాలు జరుపుకుంటున్న కనెక్షన్ దారుల దందా కళ్లముందే కనిపిస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా మామూళ్ల మత్తులో అక్రమ దారులకు వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే దీనిపై అమలాపురం డీ ఈ ను వివరణ కోరెందుకు ప్రయత్నించగా ఆయన స్పందించకపోవడం గమనార్హం...

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టిసారించి ఈ అక్రమ దందాకు అడ్డుకట్టవేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కన్నుల పండుగగా పార్వతి మల్లేశ్వర స్వామి కళ్యాణం

## వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కళ్యాణ వేడుక

## స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన నాగేశ్వరావు అశ్విని దంపతులు

## సృష్టి లయకారకుడు పరమేశ్వరుని కళ్యాణ వేడుక

**శంఖవరం, మార్చి 7,ప్రభాతవార్త**

శ్రీ పార్వతి మల్లేశ్వర స్వామిఆలయంలో కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. మండల కేంద్రమైన శంకవరంలో అన్నవరం సత్యదేవుని దత్తత దేవాలయం పార్వతి మల్లేశ్వర స్వామి ఆలయంలోకళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో సుందరంగా అలంకరించిన వేదికపై స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల నుంచి వేదపండితులు పండిత బృందం కల్యాణ వేడుక నిర్వహించారు కళ్యాణ మహోత్సవంలో భాగంగా విగ్నేశ్వర పూజ పుణ్యా వచనం దీక్షాధారణ దజారోహణ. కన్యాదానం సుముహూర్తం తలంబ్రాలు వంటి కార్యక్రమాలను పూజా కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. లోక శాంతి నిమిత్తం స్వామి అమ్మవారి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రాల అర్థం పరమార్థం భక్తులు తెలియజేశారు. అన్నవరం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు నక్క నాగేశ్వరరావు అశ్విని దంపతులు స్వామి అమ్మవారికి పట్టు వస్త్రాలను అందజేశారు.కళ్యాణం అనంతరం ప్రసాదాలను తలంబ్రాలను భక్తులకు అందజేశారు. శివాలయం ప్రధాన అర్చకుడు బ్రహ్మానంద శర్మ కుమార్ శర్మ వేద పండితులు చిట్టి శివరామ శర్మ ముష్టి పురుషోత్తం గణాపాటి చామంతి వెంకటరెడ్డి, పాలంకి పట్టాభి రామమూర్తి నిర్వహించారు.అధిక సంఖ్యలోభక్తులు గ్రామస్తులు పాల్గొని కళ్యాణం తిలకించారు.



# ప్రపంచ పురోగతిలో మహిళల పాత్ర కీలకం

## సిడిపిఓ పద్మావతి

**శంఖవరం మార్చి 7 ప్రభాతవార్త**

సమాజ అభివృద్ధిలో మహిళ పాత్ర కీలకమని భారతీయ సంస్కృతిలో మహిళలకు ఎంతో గొప్ప స్థానం ఉందని . ఒక తల్లిగా, ఒక సోదరిగా, ఒక భార్యగా, ఒక స్నేహితురాలిగా మహిళలు పురుషుల జీవితంలో ఎంతో గొప్ప పాత్రను పోషిస్తున్నారు. అలాంటి స్త్రీమూర్తులందరికీ గౌరవించేలా మహిళా దినోత్సవం రోజును జరుపుకోవడం గర్వించదగ్గ విషయమని శంకవరం ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి తెలిపారు . శంకవరంలో గల సచివాలయం 2 లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవం స్ఫూర్తిని ప్రతీరోజు కొనసాగించాలని . ప్రతి ఒక్కరు మహిళలందరికీ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేయాలని సూచించారు. సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూమహిళలు అంతరిక్షం నుండి కుటుంబందాకా ప్రగతిని సాధించారని, రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఉన్నత శిఖరాలలో మహిళలు నిలిచిన ఇంకా లింగ వివక్ష, హింస దురాగాతలుతప్పడం లేదని, మహిళలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి అన్నారు. అనంతరం బాల్య వివాహ నిషేధిత చట్టం 2006,పోస్కో చట్టాలతో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అరుణశ్రీ, రజిని. కార్యాలయ సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు




Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

